లిప్ అమలు తీరు పరిశీలన


అన్నవరం యూపీ పాఠశాలలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈవో బాలామణి తదితరులు

తగరపువలస: ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం(లిప్)ను భీమిలి ఎంఈవో కేపీ బాలామణి, చిట్టివలస స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ సీహెచ్ రోజామణి తదితరులు గురువారం పరిశీలించారు. మండలంలోని అన్నవరం యూపీ పాఠశాలతోపాటు చిప్పాడ పంచాయతీలోని కొనసవానిపాలెం ప్రాథమిక పాఠశాలలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న లిప్ ప్రోగ్రాంను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలన్నారు. అనంతరం ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళికలు, టీచింగ్ నోట్స్, డైరీలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఆర్పీ త్రినాథ్, ఉపాధ్యాయులు డీవీ సత్యవతి, రాజేశ్వరి, త్రివేణి, మధురవాణి పాల్గొన్నారు.

చిత్తడి నేలల సంరక్షణపై ర్యాలీ


పద్మనాభంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పద్మనాభం: చిత్తడి నేలలను సంరక్షించుకోవాలని కోరుతూ పద్మనాభం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చిత్తడి నేలలు సంరక్షించుకుంటే భూగర్భ జలాలు అభివృద్ధి చెందుతాయని, వాటిని కాపాడడం మన బాధ్యత అంటూ ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి.సత్యనారాయణ. పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన

కొమ్మాది: రుషికొండలో గల గిరిజన సాంస్కృతిక పరిశోధన ట్రైనింగ్ మిషన్ భవన్‌లో 14వ గిరిజన యూత్ ఎక్స్చేంజ్ కార్యక్రమం కొనసాగుతోంది. ఛత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒడిశా రాష్ట్రాల నుంచి వచ్చిన 200 మంది గిరిజన యువకులకు స్వయం ఉపాధిపై నెహ్రూ యువ కేంద్ర రాష్ట్ర సంచాలకులు ఏఆర్ విజయారావు అవగాహన కల్పించారు. అనంతరం సాయంత్రం యువకులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

పలువురు రైతులకు సన్మానం


రైతులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ బంగారునాయుడు

తగరపువలస: హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఇటీవల భీమిలి మండలం లక్ష్మీపురం పంచాయతీలో నిర్వహించిన రైతు వారోత్సవాల్లో భాగంగా తొమ్మిది మంది రైతులను వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు చేతుల మీదుగా సన్మానించింది. ఈ సందర్భంగా రైతులకు తమ బ్యాంకు అందిస్తున్న సేవలను వివరించారు. అనంతరం బంగారునాయుడు మాట్లాడుతూ దేశానికి సేవ చేస్తున్న జవానులు, రైతులను గుర్తించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు

- రూ.74 లక్షలతో రక్షణ గోడ నిర్మాణానికి శ్రీకారం
- రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మాణం


సత్యనారాయణమెట్ట వద్ద చురుగ్గా సాగుతున్న రక్షణ గోడ నిర్మాణ పనులు


చివరి దశలో రైతుబజారు నిర్మాణ పనులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు సత్యనారాయణపేటలో పక్కపక్కనే రూ.74 లక్షలతో రక్షణగోడ, రూ.78 లక్షలతో రైతుబజారు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఫిబ్రవరి నెలాఖరులోగా వీటిని పూర్తి చేయనున్నట్టు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. గత ఏడాది సెప్టెంబరులో కురిసిన వర్షాలకు సత్యనారాయణమెట్టవాలు ప్రాంతంలో 15 అడుగుల ఎత్తు, 50 మీటర్ల పొడవైన రక్షణగోడ కూలిపోయింది. అప్పట్లో జరిగిన ఈ ప్రమాదంతో స్థానికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. దీంతో జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పర్యటించి రక్షణగోడ నిర్మిస్తామని స్థానికులకు భరోసా ఇచ్చారు. ఈ మేరకు గత నెల 19న రక్షణగోడ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. అనంతరం వారం రోజుల్లోనే నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. ఈ నెల చివరిలోగా దీనిని పూర్తి చేయనున్నారు.

- తగరపువలసలో రైతుబజారు నిర్మాణానికి గత ప్రభుత్వాలు ఇక్కడి ప్రజలకు సుదీర్ఘకాలంపాటు హామీలు ఇచ్చినా నెరవేర్చలేకపోయాయి. ఎట్టకేలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2021 ఆగస్టులో రైతుబజారు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం పనులు 2022 మే నెలలో ప్రారంభమయ్యాయి. ఇక్కడ నాలుగు లైన్లలో కూరగాయల విక్రయానికి 47 దుకాణాలు, మరో రెండు లైన్లలో 10 ప్రొవిజినల్స్ స్టోర్స్ నిర్మిస్తున్నారు. వీటితోపాటు టాయిలెట్లు, ఆర్వో ప్లాంట్, క్యాంటీన్, కార్యాలయ గది, స్టోర్, కాపలాదారునికి గది నిర్మిస్తున్నారు. ఇవి కూడా ఈ నెలాఖరుకు పూర్తి కానున్నాయి. రైతుబజారులో విశాలమైన పార్కింగ్ ప్రదేశంతోపాటు వినియోగదారులు, రైతుల రాకపోకలకు రెండు గేట్లు ఏర్పాటు చేస్తున్నారు.

వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం

గతంలో రైతుబజారు నిర్మాణానికి మాటలు చెప్పి టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు ఇక్కడి రైతులు, వినియోగదారులను మోసం చేశాయి. అలాగే సత్యనారాయణపేటలో గతంలో టీడీపీ హయాంలో రెండుసార్లు రక్షణగోడ నిర్మించినప్పటికీ నాసిరకంగా పనులు చేపట్టడంతో చిన్నపాటి వర్షాలకే కూలిపోయాయి. ఇప్పుడు ఈ రెండు పనులు కూడా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నాణ్యతతో జరుగుతున్నాయని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రాజధానితో నియోజకవర్గానికి మహర్దశ

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ఓపెన్ జిమ్ ప్రారంభించి కసరత్తులు చేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

పీఎం పాలెం: పరిపాలన రాజధానిగా విశాఖ ఆవిర్భవించిన మరుక్షణం నుంచి భీమిలి నియోజకవర్గానికి మహర్దశ పడుతుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శిల్పారామం జాతరలో ఇటీవల నిర్మించిన ఓపెన్ జిమ్‌ను గురువారం ఆయన ప్రారంభించారు. కొంతసేపు అక్కడ కసరత్తులు చేసి వాటిని పరీక్షించారు. అనంతరం ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో నిర్మించిన వాటర్ పార్కును ఆయన ప్రారంభించారు. తర్వాత యోగా భవనానికి శంకుస్థాపన చేసారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుందర విశాఖ నగరానికి ప్రపంచ పటంలో ప్రత్యేక స్థానం లభిస్తుందన్నారు. టీడీపీ నాయకులు ఎంతగా తప్పుడు ప్రచారం చేసినా వారి మాటలు నమ్మే స్థితిలో రాష్ట్ర ప్రజలు లేరన్నారు. గడప గడపకూ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో ఎమ్మెల్యేలుగా గెలిపించి మరలా జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మధురవాడ జోనల్ కమిషనర్ కనక మహాలక్ష్మి, శిల్పారామం ఏవో విశ్వనాథ రెడ్డి, వైఎస్సార్ సీపీ 5, 6, 7 వార్డుల అధ్యక్షులు పోతిన హనుమంతరావు, బొట్ట అప్పలరాజు, పోతిన శ్రీనివాసరావు, నాయకులు కె.వరలక్ష్మి, గాదె రోశిరెడ్డి, వాండ్రాసి రవి, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యురాలు రాజేశ్వరి, ఎర్రాజీ, సీయాద్రి కనకరాజు, జామి శివ, కృష్ణమూర్తి పాత్రుడు, వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు లోపాలు సరిదిద్దుకోవాలి


తాళ్లవలస హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావుతో మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

తగరపువలస: ఉపాధ్యాయులు తమలోని బోధనాపరమైన లోపాలను సరిదిద్దుకోవాలని డీఈవో ఎల్.చంద్రకళ భీమిలి మండలం తాళ్లవలస జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె గురువారం హైస్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించారు. 8వ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించగా గణిత ప్రక్రియలు, భాగాహారాలు కనీస స్థాయిలో చేయకపోవడాన్ని గమనించి ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు సకాలంలో దిద్దకపోవడంపై ఆమె ఆక్షేపించారు. సిలబస్ ప్రకారం ఉపాధ్యాయులు లెసన్స్ ప్లాన్లు రాయలేదని తప్పుపట్టారు. బైజూస్ ట్యాబ్స్ అప్‌డేట్ చేయమని ముందు రోజే ఆదేశించినా ఇంకా ఉపాధ్యాయులు ప్రారంభించకపోవడంతో తీవ్రంగా తప్పు పట్టారు. అనంతరం పాఠశాల అకడమిక్ అంశాలను పరిశీలించగా సక్రమంగా లేకపోవడం గమనించారు. సమ్మేటివ్ పరీక్షల జవాబుల్లోని తప్పులు దిద్దుకోవాలని చెప్పినా కార్యక్రమం పూర్తి చేయకపోవడాన్ని గమనించారు. ఉపాధ్యాయులు తమ దైనందిన బోధనాభ్యాసన కార్యక్రమాలు మెరుగుపరచుకోవాలని ఎన్నిసార్లు చెప్పినా లక్ష్యపెట్టకపోవడంతో ప్రధానోపాధ్యాయుడు ప్రభాకరరావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో రెండురోజుల్లో తమ లోపాలు సరిచేసుకుంటామని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు డీఈవోను కోరారు. అనంతరం ఆమె తాళ్లవలస ప్రాథమిక పాఠశాల, జీవీఎంసీ బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. తాళ్లవలసలో ప్రధానోపాధ్యాయుడు అప్పారావు, ఉపాధ్యాయులు టీచింగ్ నోట్స్ రాయకపోవడాన్ని తప్పుపట్టారు. రెండు రోజుల్లో అన్ని తరగతుల వర్కు బుక్స్ సిలబస్ ప్రకారం దిద్దాలని ఆదేశించారు. బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుల పనితీరు, పాఠశాల పరిసరాలు, డైనింగ్ హాలును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మధురవాడ: ఏపీ ట్రాన్స్‌కో కొమ్మాది విద్యుత్ సబ్ స్టేషన్ రేవళ్లపాలెం, ఎన్టీఆర్ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ, మరమ్మత్తులు చేపడుతున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మధురవాడ సబ్ డివిజన్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.కిరణ్‌కుమార్ చెప్పారు. ఇందులో భాగంగా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు చంద్రంపాలెం (మధురవాడ) హైస్కూల్, రేవళ్లపాలెం విలేజ్, రేవళ్లపాలెం రోడ్డులోని పీఎం పాలెం పోలీస్ స్టేషన్ ఏరియా, బక్కన్నపాలెం 100 అడుగుల రోడ్డు, బక్కన్నపాలెం విలేజ్, పోలీస్ బెటాలియన్ ఏరియాలు, జేఎన్ఎన్‌యూఆర్ఎం కే1, కే2, కే3 కాలనీలు, ఎన్టీఆర్ కాలనీ, రైల్వే లే అవుట్, లచ్చిరాజు లే అవుట్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతోంది. వినియోగదారులు, సహకరించాలని కిరణ్‌కుమార్ కోరారు.

ఆనందపురం: మండలంలోని ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈఈ ఎ.సురేష్‌కుమార్ తెలిపారు. ఈ అంతరాయం కారణంగా ఆనందపురం, వేములవలస, పెద్దిపాలెం, పాలవలస, లొడగలవానిపాలెం, తర్లువాడ, పందలపాక, గొట్టిపల్లి, కుసులవాడ, చందక, బీపీ కళ్లాలు పంచాయతీలోని అన్ని గృహ, వాణిజ్య, పారిశ్రామిక వినియోగానికి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

ఈ - క్రాప్ ఆధారంగా
రైతు బజారు కార్డుల జారీ

ఆనందపురం : రైతు బజారు కార్డుల జారీకి ఇక నుంచి ఈ - క్రాప్ వివరాలను ఆధారంగా చేసుకోనున్నారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలందాయి. ఇంత వరకూ రైతులు దరఖాస్తు చేసుకుంటే వారి వద్ద ఉన్న పట్టాదారు పాసుపుస్తకం ఆధారంగా రెవెన్యూ అధికారులు ధ్రువపత్రాన్ని మంజూరు చేసేవారు. అయితే కూరగాయలు, ఆకుకూరలు పండించని వారు కూడా వాటిని పండిస్తున్నట్టు ధ్రువపత్రం తీసుకొని వేరే రైతుల వద్ద వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేసి రైతు బజార్లకు తరలించి విక్రయిస్తున్నారు. దీని వల్ల సాగు చేస్తున్న రైతులకు అవకాశం లేకుండా పోతోంది. ఈ క్రమంలో ప్రస్తుతం కార్డుల జారీకి నిబంధనలు మార్చారు. రైతులు సాగు చేస్తున్న భూముల్లో గల పంటల వివరాలను ఈ - క్రాప్‌లో నమోదు చేశారు. ఇక నుంచి ఈ - క్రాప్‌లో నమోదైన సర్వే నంబర్లలో కూరగాయలు, ఆకు కూరలు సాగు చేస్తున్నట్టు ఉంటేనే రైతు బజారు కార్డు జారీ చేస్తారు. దీని వల్ల నిజమైన రైతులకు న్యాయం జరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

విద్యార్థులకు ఉచిత దంత పరీక్షలు

భీమిలి : స్థానిక పండిట్ నెహ్రూ జీవీఎంసీ హైస్కూల్‌లో గురువారం సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా దంత పరీక్షలు నిర్వహించారు. 6 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు దంత సంరక్షణపై అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వంశీకృష్ణారెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ తారకేష్, విభాగాధిపతి ఉదయకుమార్, వైద్యులు శ్రావణి, సనా షేక్, మనోహర్, ప్రధానోపాధ్యాయురాలు తిరుమల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌లు ఖాళీగా ఉంచాలని ప్రచారం

మధురవాడ: పట్టణంలో విశాలమైన రోడ్లను ఆనుకుని ఉన్న ఫుట్‌పాత్‌లను పాదచారులు వినియోగించేందుకు వీలుగా వ్యాపారులు ఖాళీ చేయాలని జీవీఎంసీ జోన్ - 2 బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.హేమంత్ కుమార్ కోరారు. జీవీఎంసీ 7వ వార్డు మిథిలాపురి వుడా కాలనీ మాస్టర్ ప్లాన్ రోడ్డులో ఫుట్‌పాత్ వినియోగం, నగర సుందరీకరణపై టౌన్ ప్లానింగ్ విభాగం ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం, అవగాహన ర్యాలీ గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరాన్ని మరింత సుందరంగా, రాకపోకలకు ఇబ్బందులు లేని ప్రాంతంగా తయారు చేయాలంటే ట్రాఫిక్‌కి అడ్డంగా రోడ్లు, ఫుట్‌పాత్ ఆక్రమించి దుకాణాలు, వ్యాపారాలు చేయడం సరికాదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జోన్‌లోని అన్ని ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పించి ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించేలా చూస్తున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మిథిలాపురి వుడా కాలనీ గాంధీ విగ్రహం నుంచి జాతీయ రహదారి వరకు బ్యానర్లు, ప్లకార్డులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ ప్లానింగ్ సెక్రటరీలు శివప్రసాద్, నవీన్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీ ఏనుగులపాలెంలో యువతి అదృశ్యమైనట్టు ఏఎస్ఐ నక్కా శ్రీనివాసరావు తెలిపారు. పెందుర్తి మండలం సత్తివానిపాలెం గ్రామానికి చెందిన సతివాడ కుసుమ (19) ఏనుగులపాలెంలో ఉన్న తన అక్క హారిక ఇంటికి 40 రోజుల క్రితం వచ్చింది. ఈ నేపథ్యంలో గత నెల 31 నుంచి కనిపించలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా కనిపించలేదు. దీనిపై కుసుమ తల్లి రమణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అనిట్స్‌లో అతిథి ఉపన్యాసం

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఆర్ అండ్ డి ఇన్నోవేషన్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఇన్ ఇంజినీరింగ్ సైన్సెస్ అనే అంశంపై అతిథి ఉపన్యసించారు. నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అసోసియేట్ హెడ్ డాక్టర్ బిజయ్ కుమార్ సాహూ ముఖ్య ఉపన్యాసకునిగా పాల్గొని మాట్లాడారు. నోవల్ రీసెర్చ్ వర్క్ పేటెంట్ల వ్యాపార సరళిని వివరించారు. అలాగే ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అండ్ ఇన్నోవేషన్స్‌పై చర్చించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, విభాగాధిపతులు బి.నరసింగరావు, వి.రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పేదరికం లేని సమాజమే సీఎం జగన్ లక్ష్యం


మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: పేదరిక రహిత ఆంధ్ర రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు కాపులదిబ్బడపాలెం, కె.నగరపాలెం ప్రాంతాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. పేదరికాన్ని రూపుమాపేందుకే సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ అందజేస్తున్నామని, పేదలందరికీ ఆర్థిక భరోసా కలుగుతుందన్నారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలతో పేదల సొంతింటి కల నెరవేరిందన్నారు. పిల్లల చదువు కోసం జగనన్న వసతి దీవెన, విద్యా దీవెన, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి వంటి మహత్తర సంక్షేమ పథకాలతో భావితరాల చదువు కోసం చేయూత అందిస్తున్నామన్నారు. కె.నగరపాలెం, కాపులుప్పాడ, నిడిగట్టు, చేపలుప్పాడ, జేవీ అగ్రహారం పంచాయతీలు జీవీఎంసీలో విలీనమైన తర్వాత మౌలిక వసతులు కల్పించడంతోపాటు అభివృద్ధి చేసినట్లు తెలిపారు. అనంతరం స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి ఇక్కడ శాశ్వత శ్మశానం, కొన్ని చోట్ల డ్రైనేజీలు వంటి సమస్యలు తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, తహసీల్దార్ వేణుగోపాల్, జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, జీవీఎంసీ కోఆప్షన్ మెంబర్ కొప్పుల ప్రభావతి, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పాల రమణారెడ్డి, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉపాధి అవకాశాలు

మురళీనగర్: డిగ్రీ పూర్తి చేసిన యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఏపీసీటీఈ చీఫ్ కో-ఆర్డినేటింగ్ అధికారి బుద్ధా చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం జాతీయ అప్రంటీస్‌షిప్‌పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐటీఐ, పాలిటెక్నిక్, బీటెక్, డిగ్రీ పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఏడాది పాటు అప్రంటీస్‌షిప్ శిక్షణ ఇవ్వనున్నట్టు తెలిపారు. పరిశ్రమల ప్రతినిధులు వారి అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. శిక్షణ అనంతరం కంపెనీలు నైపుణ్యం కలిగిన వారిని ఉద్యోగాల్లోకి తీసుకుంటారని చెప్పారు. ఈ వర్క్‌షాప్‌లో సుమారు వివిధ కంపెనీల ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలు తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ సత్యనారాయణమూర్తి, ఏపీఎస్ఎస్‌డీసీ చైర్మన్ అజయ్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్ట్ టైమ్ జాబ్ పేరుతో టోకరా

- టాస్కుల పేరుతో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు రూ.8.82 లక్షలకు టోపీ
- సైబర్ పోలీసులను ఆశ్రయించిన బాధితుడు

దొండపర్తి (విశాఖ దక్షిణ): పార్ట్ టైం జాబ్ పేరుతో నగరానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు సైబర్ నేరగాళ్లు టోకరా వేశారు. ఇంటి నుంచే జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని నమ్మించి ఏకంగా రూ.8.82 లక్షలు కాజేశారు. సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ భవానీ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం... తగరపువలస ప్రాంతానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వాట్సాప్‌కు జీఏఎస్ కంపెనీ రిసెప్షనిస్ట్ అని పరిచయం చేసుకుంటూ ఇంటి నుంచే పార్ట్ టైం జాబ్ చేసుకొని డబ్బు సంపాదించుకోవచ్చని మెసేజ్ చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ముందు వద్దని రిప్లై ఇచ్చినప్పటికీ... అతడిని నమ్మించేందుకు అకౌంట్‌లో రూ.100 జమ చేశారు. దీంతో అది నిజం అని నమ్మి వారితో చాటింగ్ చేయడం ప్రారంభించాడు. పార్ట్ టైం జాబ్స్ పేరుతో సైబర్ నేరగాళ్లు సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ వాట్సాప్, టెలిగ్రామ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగాంలో ప్రకటనలు, మెసేజ్‌లు పంపించారు. వీటికి ఎవరైతే స్పందిస్తారో వారికి కమీషన్ ఆశ చూపిస్తూ కమిషన్ బేస్డ్ టాస్క్ గేమ్స్ కింద వారిని నియమించుకుంటున్నారు. ఇందుకోసం నకిలీ వెబ్‌సైట్‌ను సైతం డిజైన్ చేశారు. దీని ప్రకారం సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌కు యూట్యూబ్‌లో వీడియోస్‌కు లైక్, షేర్, సబ్‌స్క్రైబ్ చేయమని చెప్పారు. అలా చేసినందుకు ప్రతి లైక్‌కు రూ.100 నుంచి రూ.130 వరకు అకౌంట్‌లో జమ చేశారు. ఇలా మొదటి రోజు బాధితుడికి 4 వీడియోలకు లైక్ చేయమని చెప్పి రూ.400 బ్యాంక్ ఖాతాలో వేశారు. మరో టాస్క్ కోసమని టెలిగ్రాం యాప్‌కి రీడైరెక్ట్ చేసి గైడెన్స్ కోసం ఒక ట్యూటర్‌ని ఇస్తున్నట్లు చెప్పి మొదటి టాస్క్ రూ.54 వేలు పెట్టి కొనాలని నమ్మించారు. అందుకుగాను 30 శాతం కమిషన్‌తో కలిపి రూ.70,200 వస్తుందని చెప్పారు. ఇది నిజమనుకొని సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు డబ్బులు ఇచ్చి కొని వారు చూపించిన వెల్ఫేర్ టాస్క్ బటన్ కొట్టగా కమిషన్‌తో కలిపి రూ.70,200 ఇస్తున్నట్లు చూపించి విత్ డ్రా చేసుకోవడానికి వీలు లేకుండా చేశారు. డబ్బులు విత్ డ్రా చేయాలంటే తప్పనిసరిగా మరికొన్ని టాస్కులు పూర్తి చేయాలని చెప్పి అలా రూ.8.82 లక్షలు కాజేశారు. డబ్బులు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత డబ్బులు చెల్లించాలని చెప్పడంతో మోసపోయినట్లు గ్రహించి సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్యకు పాల్పడిన శైలజ


భర్త విజయకుమార్‌తో శైలజ (ఫైల్)

పరవాడ: ఉరిపోసుకొని వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన గురువారం స్థానిక జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో చోటుచేసుకుంది. సీఐ ఈశ్వరరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. నాయుడుపాలెం శివారు వెంకటపతిపాలెం గ్రామానికి చెందిన పైల విజయకుమార్ కొంత కాలంగా పరవాడ ఆర్ఈసీఎస్ విద్యుత్ సంస్థలో సహాయ లైన్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. అతడు ఐదేళ్ల క్రితం పెందుర్తి మండలం పులగానిపాలెం గ్రామానికి చెందిన శైలజ(24)ను వివాహం చేసుకొన్నాడు. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. వీరు ఏడాది క్రితం నుంచి పరవాడ దరి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటున్నారు. భార్యాభర్తలు బుధవారం రాత్రి భోజనం చేసి నిద్రకు ఉపక్రమించారు. గురువారం ఉదయం 5 గంటలకు నిద్ర లేచిన విజయకుమార్.. పడకగదిలో ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్న భార్యను చూసి క్వార్టర్‌లో నివాసం ఉంటున్న వారికి విషయం చెప్పాడు. ఆమెను కిందకు దించి ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. సమాచారం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న భార్య తరపు బంధువులు పరవాడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనకాపల్లి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, పరవాడ సీఐ పి.ఈశ్వరరావు, తహసీల్దారు ప్రకాశరావు ఘటన స్థలాన్ని సందర్శించి ఆత్మహత్యకు గల కారణాలను భర్తను, బంధువులను అడిగి తెలుసుకున్నారు. క్లూస్‌టీం ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించింది. పోస్టుమార్టం కోసం శైలజ మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు.

కేకే లైన్లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు


పట్టాలు తప్పిన గూడ్స్ వ్యాగన్లు

అనంతగిరి: కేకే లైన్‌లో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతగిరి మండల పరిధిలో శివలింగపురం రైల్వేస్టేషన్ యార్డు 45వ కిలోమీటర్ వద్ద గురువారం ఉదయం 6 గంటల సమయంలో విశాఖ నుంచి కిరండూల్ వెళుతున్న గూడ్స్ రైలు పట్టాలు తప్పింది. 8 వ్యాగన్లు పట్టాలు తప్పడంతో ట్రాక్ బాగా దెబ్బతింది. ఓహెచ్‌సీ విద్యుత్ లైన్ తెగిపోవడంతోపాటు.. పట్టాలు తప్పిన బోగీలు ఢీకొట్టడంతో రెండు స్తంభాలు ధ్వంసమయ్యాయి. రైల్వే సిబ్బంది యుద్ధప్రతిపాదికన ఘటన స్థలానికి చేరుకుని, పునరుద్ధరణ పనులు ప్రారంభించారు. ఈ నెల 3న విశాఖలో బయల్దేరాల్సిన విశాఖపట్నం-కిరండూల్ (08551) పాసింజర్ స్పెషల్ రద్దు చేశారు. అలాగే 3న కిరండూల్-విశాఖ(08552) పాసింజర్‌నూ రద్దు చేశారు.

వీక్లీ స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ధన్‌బాద్ - కోయంబత్తూర్ మధ్య వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ధన్‌బాద్ - కోయంబత్తూర్ (03357 /03358) వీక్లీ స్పెషల్ ధన్‌బాద్‌లో ప్రతీ ఆదివారం ఉదయం 6 గంటలకు బయల్దేరి విశాఖ మీదుగా కోయంబత్తూర్‌కు మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు చేరుతుంది. తిరుగు ప్రయాణంలో ప్రతీ మంగళవారం మధ్యరాత్రి 12.50 గంటలకు కోయంబత్తూర్‌లో బయల్దేరి విశాఖ మీదుగా గురువారం రాత్రి 10.30 గంటలకు ధన్‌బాద్ చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఈనెల 5 నుంచి మార్చి 29 వరకు నడుస్తాయి.

రక్తమార్పిడితో నిలిచిన పాప ప్రాణం



పాపతో తల్లిదండ్రులు, కిమ్స్ ఐకాన్ నియోనాటాలజీ విభాగాధిపతి నిఖిల్

అక్కిరెడ్డిపాలెం: తీవ్ర పచ్చ కామెర్లతో ఆస్పత్రిలో చేరిన ఓ చిన్నారికి షీలానగర్ కిమ్స్ ఐకాన్ వైద్యులు రక్తమార్పిడి చేసి ప్రాణాలు నిలిపారు. ఆస్పత్రిలో గురువారం జరిగిన కార్యక్రమంలో నియోనాటాలజీ విభాగాధిపతి డాక్టర్ నిఖిల్ తెన్నేటి ఈ వివరాలు వెల్లడించారు. 'గాజువాక ప్రాంతానికి చెందిన రియానా బేగం ఓ ప్రభుత్వ ఆస్పత్రిలో పాపకు జన్మనిచ్చింది. తల్లి బ్లడ్ గ్రూప్ ఓ నెగిటివ్, బిడ్డ బ్లడ్ గ్రూప్ ఓ పాజిటివ్. ఈ కారణంగా పాపకు తీవ్రస్థాయిలో పచ్చకామెర్లు సోకాయి. బిడ్డ పుట్టిన 52 గంటల తర్వాత చికిత్స నిమిత్తం కిమ్స్ ఐకాన్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. చిన్నారికి వెంటనే పరీక్షలు నిర్వహించాం. పాపకు బిలిరుబిన్ 36 మిల్లీ గ్రామ్స్ పర్ డెసీలీటర్‌గా ఉంది. అది చాలా ఎక్కువ కావడంతో మెదడు కూడా ప్రభావితమై పాప ఊపిరి పీల్చుకోవడం కష్టతరమైంది. ఈ క్రమంలో పలుమార్లు ఫిట్స్‌కు కూడా గురైంది. దీంతో పాపకు శరీరంలో మొత్తం రక్తం తీసేసి.. అదే గ్రూప్‌కు చెందిన కొత్త రక్తాన్ని ఎక్కించాం. వెంటనే బిలిరుబిన్ స్థాయి 17.6కు తగ్గింది. ఒకే గ్రూపులో పాజిటివ్, నెగిటివ్ ఉంటే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి.'అని వైద్యుడు నిఖిల్ వివరించారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి.. సంపూర్ణ ఆరోగ్యంతో చిన్నారిని డిశ్చార్జ్ చేశారు. ఈ చికిత్సలో డాక్టర్ సంతోష్ పాల్గొన్నారు.

మహిళకు బ్యాగ్ అప్పగింత



బాధితురాలికి బ్యాగ్ అందజేస్తున్న క్రైం డీసీపీ నాగన్న

అల్లిపురం: ఆటోలో మరిచిపోయిన బ్యాగును పోలీసులు వెతికి పట్టుకుని బాధితురాలికి అప్పగించారు. వివరాలివీ.. పోతినమల్లయ్యపాలేనికి చెందిన ఎం.కస్తూరిబాయి బుధవారం తమ ఇంటికి వెళ్లేందుకు జడ్జి కోర్టు వద్ద ఆటో ఎక్కారు. ఆమె వద్ద డ్రై వాష్ చీరలతో బ్యాగ్, హ్యాండ్ బ్యాగ్ ఉంది. గొల్లలపాలెం సర్కిల్ వద్ద డ్రై వాష్ చీరల బ్యాగ్ తీసుకుని దిగిపోయారు. హ్యాండ్ బ్యాగ్ ఆటోలో మరిచిపోయారు. అందులో రూ.లక్ష నగదు ఉంది. కొంతసేపటి వరకు ఆమెకు తన బ్యాగ్ గుర్తుకురాలేదు. తర్వాత తేరుకుని ఆటోలో మరిచిపోయానని గ్రహించారు. ఆటోను పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో టూటౌన్ క్రైం పోలీసులను ఆశ్రయించారు. డీసీపీ క్రైం జి.నాగన్న ఆదేశాల మేరకు ఈస్ట్ సబ్ డివిజన్ క్రైం సీఐ ఎర్రంనాయుడు, టూటౌన్ క్రైం ఎస్ఐలు కె.శ్రీను, డీవీ అప్పారావు తమ సిబ్బందితో కలసి బృందాలుగా ఏర్పడి ఆటోను పట్టుకున్నారు. డ్రైవర్ నుంచి బ్యాగును స్వాధీనం చేసుకున్నారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయం సమావేశ మందిరంలో గురువారం బాధితురాలికి నగదుతో సహా బ్యాగ్‌ను అందజేశారు. దీంతో ఆమె పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.